# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 10, మార్చి 2026


మహిళా దినోత్సవం సందర్భంగా బీసీ రాష్ట్ర మహిళా కన్వీనర్‌కి

## జాతీయ పురస్కార అవార్డు



మంచిర్యాల, మార్చి 9, ప్రభాతవార్త

శంకరం ఫౌండేషన్ భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లెజెండరీ జాతీయ పురస్కారం 2026 పురస్కార అవార్డును పేరం అలేఖ్య హైకోర్టు న్యాయవాది, బిసి స్టేట్ మహిళా కన్వీనర్, న్యాయ రంగం నుంచి ప్రముఖులు ఆంధ్రప్రదేశ్ మిగతా 2లో..

# వేరు వేరు ఘటనలో నలుగురు మృతి







### నిర్మల్‌లో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు, దండేపల్లిలో విద్యుత్ షాక్ తో ఇద్దరు కూలీలు మృతి

నిర్మల్ / దండేపల్లి, మార్చి 9, ప్రభాతవార్త:

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వేరువేరు చోట్ల నలుగురు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలకు వెళ్తే మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని మేదరిపేట ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద ఎత్తైన ఇనుప స్టాండ్ ను తీసుకెళ్లే క్రమంలో మెయిన్ లైన్ విద్యుత్ తీగలు స్టాండ్‌కు తగలడంతో ఇద్దరు కూలీలు విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు మాదాపూర్ కు చెందిన చల్ల లక్ష్మీనారాయణ (45), వెల్లనూర్‌కు చెందిన చందనగిరి నాగరాజు(40) గా గుర్తించారు. ఇరువురు స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. ఇద్దరి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పెట్రోల్ బంకు నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, నష్ట పరిహారం అందించాలని కోరుతూ మృతుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సై తహసీనుద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి వివరాలు సేకరించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బైంసా రోడ్డులో గోల్డెన్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం డివైడర్ ను ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ప్రమాదంలో పట్టణంలోని మంజులాపూర్‌కు చెందిన సృజన్ (33), నటరాజ్ నగర్ కు చెందిన కపుల్ (34) అనే యువకులు మృతి చెందారు. దీంతో మృతుల గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





## రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ కె. హరిత
- కాగజ్‌నగర్ మండలం బోరిగాంలో రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 9, ప్రభాతవార్త

నిరుపేదల సంక్షేమంలో భాగంగా రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం కాగజ్ నగర్ మండలం బోరిగాం గ్రామంలో నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇండ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండు మిగతా 2లో..



ప్రజావాణి దరఖాస్తులను

## త్వరగా పరిష్కరించాలి



- ✦ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మార్చి 9, ప్రభాతవార్త

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇరవేని రాయమల్లు తన భూమికి సంబంధించి పాత పట్టాదారు పాసుపుస్తకం ఉందని, నూతన పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన దుర్గం మల్లేష్ తనకు సమీకృత కూరగాయల మార్కెట్ లో కేటాయించిన దుకాణాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కన్నేపల్లి మండల కేంద్రానికి చెందిన బోయ పోచం తనకు పూర్వీకుల నుండి వస్తున్న భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయమై మిగతా 2లో..

పల్లెలే దేశానికి

## పట్టుకొమ్మలు

- ✶ ఎమ్మెల్సీ దండే విఠల్
- ✶ గ్రామంలో 10 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణం

సిర్పూర్ (టి), మార్చి 9, ప్రభాతవార్త :

సిర్పూర్ మండలం చింతకుంట గ్రామ సర్పంచ్ అజ్మీరా చత్రు నాయక్ అధర్వంలో జరిగిన గ్రామ సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి గ్రామాలు పట్టుకొమ్మలాంటివి అని అన్నారు. గ్రామ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మిగతా 2లో..



## మహిళా దినోత్సవం సందర్భంగా బీసీ రాష్ట్ర మహిళా కన్వీనర్‌కి జాతీయ పురస్కార అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టు జస్టిస్ టి.రజని, తెలంగాణ హైకోర్టు జస్టిస్ బి చంద్రకుమార్, కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ ,చైర్మన్ భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, యలవర్తి ధనలక్ష్మి అధ్యక్షురాలు శంకరం ఫౌండేషన్ చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. కవుల రచయితల న్యాయమూర్తుల, న్యాయవాదుల, జర్నలిస్టుల, పెద్దల, మహిళ కవుల, ప్రభుత్వ అధికారుల అందరి సమక్షంలో సుందరయ్య భవన్ హైదరాబాద్ మహానగరంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు జరగగా, ఈ కార్యక్రమంలో మహిళా పురస్కార గ్రహీతలు, న్యాయవాది నటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పడక గదుల నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పన త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లను త్వరగా పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పూర్తి అయిన ఇండ్లలో విద్యుత్ సౌకర్యం, చిన్న పనులు, వీధి దీపాలు, త్రాగునీరు, మురుగు కాలువలు, అంతర్గత రహదారుల పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మొత్తం మంజూరైన 480 ఇండ్లకు 192 ఇండ్లు బేస్మెంట్ దశలో ఉండటానికి గల కారణాలను గృహ నిర్మాణ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన 288 ఇండ్లు తుది దశలో ఉన్నందున పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. అనంతరం కాగజ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు సన్నద్ధం అవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సిద్ధం చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు సబ్జెక్టులపై విద్యార్థులకు గల అనుమానాలను నివృత్తి చేస్తూ పరీక్షలు అంటే భయం లేకుండా చేయాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వంటశాల, తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు సులభంగా జీర్ణమయ్యే ఆహారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పి.డి. ప్రకాష్ రావు, తహసిల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

## పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు

(మొదటిపేజీ తరువాయి)

కట్టుబడి ఉందని ప్రజలందరూ సమైక్యంగా కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. అలాగే గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ మండల నాయకులు ప్రజాప్రతినిధులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

విచారించి తనకు న్యాయం చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆల్ ఇండియా ఎస్.సి./ఎస్.టి. ఐక్యవేదిక ప్రతినిధి పెరుగు తిరుపతి తన దరఖాస్తులో లక్షెట్టిపేట మండలం ఉత్కూరు చౌరస్తాలో గురువారం జరుగుతున్న వారసంతను వ్యవసాయ మార్కెట్ యార్డు ఏరియాకు మార్చాలని కోరారు. రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి గుంట నాగరాజు తన దరఖాస్తులో డిఫాల్ట్ మిల్లర్లకు విధించిన 25 శాతం జరిమానా, 12 శాతం వడ్డీ మాఫీ చేసి ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలను ఇప్పించాలని కోరారు. వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామానికి చెందిన పొలంపల్లి మల్లయ్య, పొలంపల్లి మధునయ్యలు తమకు వారసత్వంగా సంక్రమించిన ఆస్తిని పెద్దమనషుల సమక్షంలో పాలి పంపకం చేసుకున్నామని, తమ వాటాకు వచ్చిన భూమిని కొందరు ఒప్పందాన్ని ఉల్లంఘించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటనపై తగు విచారణ జరిపి, అట్టి రిజిస్ట్రేషన్ ను రద్దు పరచి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం రంగపేట గ్రామానికి చెందిన దుర్గం సుమన్ తనతోపాటు మరి కొంతమంది రైతులకు షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ నుండి బోర్ పాయింట్ గుర్తించి బోర్ చేయడం జరిగిందని, ఇట్టి బోరులకు విద్యుత్తు లైన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామపంచాయతీలలోని సర్పంచ్, ఉపసర్పంచ్, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీలలోని మేయర్/చైర్ పర్సన్, డిప్యూటీ మేయర్/వైస్ చైర్‌పర్సన్‌లకు ఈ నెల 12వ తేదీన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతి, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులకు సంబంధించి గ్రామాలు, డివిజన్లు/వార్డుల వారీగా పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. సిఎం కప్ 2025లో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలను పూర్తి చేసుకుని రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీలలో జిల్లా నుంచి పాల్గొని బ్యాడ్మింటన్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పతకాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థిని వైద్యానికి ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ భరోసా

లక్షెట్టిపేట, మార్చి 9, ప్రభాతవార్త

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఒక నిరుపేద కుటుంబానికి ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన కండె స్వామి జ్యోతి దంపతుల కుమార్తె నిషా (13) గత రెండు నెలలుగా తీవ్రమైన ఎముకల కీళ్ల వ్యాధితో బాధపడుతోంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ఈ చిన్నారి చికిత్స నిమిత్తం సుమారు 4 లక్షల రూపాయల వరకు ఖర్చవుతుందని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. అంత పెద్ద మొత్తాన్ని భరించే స్థోమత లేక ఆ కుటుంబం పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సోమవారం వారి నివాసానికి వెళ్లారు. బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పడమే కాకుండా, తక్షణ సహాయం కింద 15 వేల రూపాయల చెక్కును పాప తండ్రి కండె స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు బీనవేని సంపత్, కోశాధికారి తూముల సురేష్, సభ్యులు బండారి భూమేష్, జెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

# ఎన్‌హెచ్ 363 పై రోడ్డు ప్రమాదం

✦ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృతి

నస్పూర్, మార్చి 9, ప్రభాతవార్త

జాతీయ రహదారి 363 పై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ అర్జున బాదు రుప్నావార్ మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సీసీసీ నస్పూర్ ఎస్‌హెచ్‌ఓ ఎం. ప్రశాంత్ వెల్లడించారు. బెల్లంపల్లి నుంచి శ్రీరాంపూర్ వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ అజాగ్రత్తగా వాహనాన్ని నడిపి ముందు మొక్కలకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. సింగపూర్ ప్లాట్స్ సమీపంలో ఉదయం 11:15 గంటల సమయంలో నేషనల్ హైవే సిబ్బంది రోడ్డు భద్రతా సైన్ బోర్డులు ఏర్పాటు చేసి మొక్కలకు నీరు పోస్తున్నారు. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ వాటర్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. డ్రైవర్ అర్జున బాదు రుప్నావార్ తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అజ్మీరా శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హెచ్ ఓ తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జైన ఆయిల్ ట్యాంకర్ ముందు భాగం

# సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అనిర్వచనీయం

## నారీ శక్తి పురస్కారాలు ప్రదానం - ఘనంగా మహిళా దినోత్సవం

**మందమర్రి, మార్చి 9, ప్రభాతవార్త**

సమాజ అభివృద్ధిలో మహిళలు పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్, సమిష్టి చేయూత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వల్లభాపూరపు సూర్యనారాయణ, పున్నమ్మ, ధరణి కోట తిమోతి జ్ఞాపకార్థంగా మందమర్రి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో సోమవారం నారీ శక్తి పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ నిర్వాహకుడు సునార్కర్ రాంబాబు నేతకాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్, డాక్టర్ బాలాజీ, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు నల్వాల సమ్మయ్య యాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పున్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న మహిళలకు నారీ శక్తి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ పురస్కారాలను పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. భవాని, ఉపాధ్యాయురాలు జి. పుష్పలత, న్యాయవాది వకుల, మహిళా కానిస్టేబుల్ పి. సౌజన్య, కూచిపూడి నృత్య గురువులు కాపూడి వసుధ, గట్టు శ్రావణి తదితరులు అందుకున్నారు. అదేవిధంగా శ్రీ చైతన్య పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాళ్లను సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు సమాజ కట్టుబాట్ల కారణంగా వంటింటికే పరిమితమైన మహిళలకు డా. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వంటి మహనీయులు చైతన్యం నింపి విద్య, హక్కుల కోసం పోరాటానికి మార్గం చూపారని గుర్తు చేశారు. అలాగే తొలి మహిళా వైద్యురాలు డాక్టర్ ఆనందీబాయి జోషి, అంతరిక్షంలోకి వెళ్లిన కల్పనా చావ్లా, తొలి మహిళా ఐపీఎస్ అధికారిణి కిరణ్ బేడీ వంటి ప్రముఖులు మహిళలకు ఆదర్శప్రాయులని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇంచార్జీలు సునీత, తిరుమల, హెప్సిబా, సాహిత్య, శిరీష, దివ్య తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు నారీ శక్తి పురస్కారాలు ప్రదానం చేస్తున్న దృశ్యం

## మంచిర్యాల రూరల్ సీఐగా గోపతి రవీందర్ బాధ్యతల స్వీకరణ

**నస్పూర్, మార్చి 9, ప్రభాతవార్త**



మంచిర్యాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా గోపతి రవీందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఏ. అశోక్ శ్రీరాంపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో రవీందర్ నియమితులయ్యారు. సోమవారం ఉదయం కార్యాలయానికి చేరుకున్న రవీందర్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో మాట్లాడి శాంతిభద్రతల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించడానికి, నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని ఆయన పేర్కొన్నారు.

## ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య పనులు ప్రారంభించిన సర్పంచ్

**లక్షెట్టిపేట, మార్చి 09, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య పనులను అంకత్‌పల్లి సర్పంచ్ లింగంపల్లి లతా వెంకటేష్ ప్రారంభించారు. సోమవారం రోజు అంకతిపల్లి గ్రామ పంచాయతీ ఉద్యానవనం శుభ్రపరచడం, డంపింగ్ యార్డ్ పరిశీలన, అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పరిసరాలు పరిశుభ్రంగా చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగంపల్లి లతా వెంకటేష్, కార్యదర్శి ప్రదీప్, 5వ వార్డు మెంబర్ చాతరాజు శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్



## తేజాపూర్ గ్రామంలో వైభవంగా సాధు సమ్మేళనం

**నేరడిగొండ, మార్చి 09, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామంలో సాధు సమ్మేళనం, వేదాంత విజ్ఞాన మహాసభలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మార్చి 11 వరకు కొనసాగుతాయని గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నాలుగు రోజుల పాటు జరిగే సభల్లో ప్రముఖ సాధువులు, వేదాంత పండితులు పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తారు. భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సాధు సమ్మేళనాన్ని, వేదాంత విజ్ఞాన మహాసభలను విజయవంతం చేయాలని తేజాపూర్ గ్రామ కమిటీ సభ్యులు కోరారు.



## ప్రజావాణి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ రాజర్షి షా

**ఇచ్చోడ, మార్చి 09, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు స్వయంగా విన్నవించుకున్నారు. ఇచ్చోడ గ్రామ సర్పంచ్ జల్లై జాకు కలెక్టర్‌ను కలిసి గ్రామంలోని పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రజల నుండి అందిన అర్జీలను పరిశీలించిన కలెక్టర్.. ఆయా సమస్యలను ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో రవీంద్ర, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఇచ్చోడ, మార్చి 09, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ఇస్లాంపుర కాలనీలో రూ. 30 లక్షలతో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నాణ్యతతో పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జల్లై జాకు, ఉపసర్పంచ్ శిరీష్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

## బౌద్ధ ధమ్మ పరిషత్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే..

మండల కేంద్రంలో ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న ద్వితీయ బౌద్ధ ధమ్మ పరిషత్ కార్యక్రమ పోస్టర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ఎమ్మెల్యేను కలిసి, సదస్సులకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దాబ (కె) ఉపసర్పంచ్ గణేష్, మాజీ ఎంపీటీసీ రమేష్ నర్వడే, అడ్వకేట్ ధమ్మపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, మార్చి 09, ప్రభాతవార్త:**

బోథ్ మండల కేంద్రంలో తెలంగాణ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో, నేరడిగొండ పీఏసీఎస్ సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం ప్రారంభించారు. నాఫెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మొదటి విడతగా కందులు తెచ్చిన రైతును ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు స్వామి, కన్వీనర్ నారాయణ రెడ్డి, నాయకులు సుధీర్ రెడ్డి, రవీందర్, రవి, రాజు, శ్రీధర్ రెడ్డి, అల్లకొండ ప్రశాంత్, ప్రవీణ్, విడిసి పోతన్న, సురేందర్ యాదవ్, ఎలుక రాజు, సుభాష్, రమణ గౌడ్, చింటూ రెడ్డి, దివాకర్ రెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచ్చి శ్రీనివాస్‌కు ప్రొఫెసర్‌గా పదోన్నతి

ఇచ్చోడ, మార్చి 09, ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచ్చి శ్రీనివాస్‌కు కెరీర్ అడ్వాన్స్‌మెంట్‌లో భాగంగా ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు కళాశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు విడుదల చేశారు. శ్రీనివాస్ గత 24 ఏళ్లుగా జూనియర్ లెక్చరర్‌గా, ఆంగ్ల భాషా అధ్యాపకుడిగా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా విశేష సేవలు అందించారు. 2023లో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పరిశోధన పత్రాలను సమర్పించారు. ముఖ్యంగా 2015లో ఇంగ్లాండ్‌లోని ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధనను సమర్పించారు. ఆయన రూపొందించిన పాఠ్యప్రణాళికను లండన్‌లోని ట్రినిటీ కళాశాల ఉత్తమమైనదిగా ఎంపిక చేయగా, బ్రిటిష్ కౌన్సిల్ చెన్నై వారు ఆయన రాసిన వ్యాసాన్ని ఉత్తమ వ్యాసంగా గుర్తించారు. అలాగే అమెరికా ఎంబసీ నుంచి రెండుసార్లు స్కాలర్‌షిప్ పొంది, ఒరెగాన్ యూనివర్సిటీలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్‌లో శిక్షణ పూర్తి చేశారు. ఆయనకు పదోన్నతి లభించడంపై కళాశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



గెలుపొందిన పతకాలతో విద్యార్థులు

## కుంగ్ ఫు, కరాటే పోటీలకు నీల్వాయి కస్తూరిబా విద్యార్థుల ప్రతిభ

వేమనపల్లి, మార్చి 09, ప్రభాతవార్త

రాష్ట్రస్థాయి కుంగ్ ఫు, కరాటే పోటీలలో నీల్వాయి కస్తూరిబా పాఠశాల విద్యార్థినిలు అత్యంత ప్రతిభ కనబరిచారని మాస్టర్ పట్టం తిరుపతి తెలిపారు. ఆదివారం ధర్మపురిలో జరిగిన టీం కాటా విభాగంలో ఏ గ్రూప్ టీం కాటా విభాగంలో తేజశ్రీ, భార్గవి, పావని బంగారు పతకాలు, బి గ్రూప్‌లో ఎం. గీత, ఓ. శృతి, యస్. అంజలి బంగారు పతకాలు, సి గ్రూప్ టీం కటా విభాగంలో బి. అరుణ, డి. రజిత ఎం. సుస్మిత బంగారు పతకాలు ఇండివిజల్ కాటా విభాగంలో పి. అంజలి, వి. హర్షిత ఆర్. శ్రీనిజ బంగారు పతకాలు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు టైగర్ ఫిష్ సంస్థ ఫౌండర్ మాస్టర్ మోయిన్, కస్తూర్బా పాఠశాల ఎస్ఓ మయూరి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## ఒత్తిడి వీడి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

**- విద్యార్థులకు విద్యాశాఖ అధికారుల మార్గనిర్దేశం**

వేమనపల్లి, మార్చి 9, ప్రభాతవార్త

పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పరీక్షల పట్ల భయం, ఒత్తిడిని వీడి పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య ఆదేశాల మేరకు సోమవారం వేమనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం టీషాట్ ఛానెల్ ద్వారా ప్రత్యేక మోటివేషన్, గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి ప్రత్యక్ష ప్రసారమైన కార్యక్రమంలో విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పాఠశాలలోని అత్యాధునిక ఐఎఫ్‌పి స్క్రీన్ ద్వారా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించి, నిపుణులు సూచించిన మెళకువలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల మధ్య లభించే విరామ సమయాన్ని వృధా చేయకుండా, పునర్విమర్శ కోసం సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. విద్యార్థులు ప్రశాంతమైన మనసుతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



### కేజీబీవీ, యుఆర్ఎస్, ఎస్ఎస్ఎ

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**✧ టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి**

తాండూర్, మార్చి 9, ప్రభాతవార్త :

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో, పట్టణ గురుకులాల్లో పనిచేస్తున్న బోధన బోధనేతర సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టిఎస్ యుటిఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చక్రపాణి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవీ ముందు సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారన్నారు. గతంలో ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయగా గత పాలకులు, అధికారులు హామీలు ఇచ్చి అమలు చేయడం లేదని ఆరోపించారు. గతేడాది ఉద్యోగులు 29 రోజులు సమ్మె చేయగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వర్చులు జరిపి పలు ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బందికి కనీస మూల వేతనాన్ని చెల్లించాలని, ఆరోగ్య భద్రత కల్పించడం కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని, కేర్ టేకర్లను నియమించి రాత్రి కాపలా డ్యూటీల నుండి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ బడ్జెట్ సమావేశాల్లోపే సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 16న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, 20న చలో అసెంబ్లీ తదితర ఆందోళన కార్యక్రమాలు చేపట్టుతామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు లావణ్య, మండల అధ్యక్షులు దేవదాస్, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, ఎస్ఎస్ఎ ఉద్యోగులు పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న కేజీబీవీ, యూ, ఎస్ఎస్ఎ ఉద్యోగులు




## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ఇచ్చోడ, మార్చి 09, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, వారు శక్తి స్వరూపులని కొనియాడారు. ప్రస్తుత కాలంలో మహిళలు అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుతూ ముందంజలో ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. మహిళలకు సముచిత గౌరవం అందించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సరస్వతి, మహిళా సాధికారత సమన్వయకర్త డాక్టర్ వి. సరిత రాణి, డాక్టర్ జే. అనిత, విజయలక్ష్మి, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఇచ్చోడ, మార్చి 09, ప్రభాతవార్త:



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, చికిత్సలను ఆయన స్వయంగా పరిశీలించి సమీక్షించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సహాయంపై కలెక్టర్ ఆరా తీశారు. స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులో ఉంచి మెరుగైన చికిత్స అందిస్తున్నామని, మందుల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ మెగా ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, స్పెషలిస్ట్ వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇచ్చోడ తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇమ్రాన్ ఖాన్

ఇచ్చోడ, మార్చి 09, ప్రభాతవార్త:



మండల తహశీల్దార్‌గా ఇమ్రాన్ ఖాన్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన సోనాల, బోథ్ మండలాల్లో తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను వేగంగా అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా రైతుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నేడే మెగా జాబ్ మేళా

నేరడిగొండ, మార్చి 09, ప్రభాతవార్త:

ఆదిలాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఈరోజు (మార్చి 10న) భారీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. సుమారు 50కి పైగా ప్రముఖ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయని, దాదాపు 2,000కు పైగా ఉద్యోగ ఖాళీలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 13,000 నుండి రూ. 40,000 వరకు వేతనం ఉంటుందని వెల్లడించారు. ఈ జాబ్ మేళా ఆదిలాబాద్‌లోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై వినియోగించుకోవాలని ఎస్సై ఇమ్రాన్ ఖాన్, సాయి చైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సామ రాజ్ కిరణ్ రెడ్డి, కరస్పాండెంట్ కార్తీక్, వైస్ ప్రిన్సిపాల్ శరత్, అధ్యాపకులు కదారి లింగన్న కోరారు.



# ఎంఆర్‌సి ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన

## - టీఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జాదవ్ సుభాష్

**సిర్పూర్ (టి), మార్చి 9, ప్రభాతవార్త**

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో మరియు పట్టణ గురుకులాల్లో పనిచేస్తున్న బోధన బోధనేతర సిబ్బంది సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తత్సర వైఖరికి నిరసనగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఆధ్వర్యంలో దశలవారీ పోరాటం చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. కేజీబీవీ యుఆర్ఎస్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయి. రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నా వేతనాలు అరకొరగానే ఉన్నాయి. గతంలో చేసిన అనేక పోరాటాల సందర్భంలో సర్వీస్ కండిషన్లకు సంబంధించి అధికారులు ఇచ్చిన హామీలు, అమలు జరపకపోగా గత సంవత్సరం 29 రోజులు సమ్మె చేసిన సమయంలో ఉపముఖ్యమంత్రి గారితో జరిగిన చర్చల సందర్భంగా అంగీకరించిన అంశాలు కూడా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని తెలిపారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోగా పోరాడితే కక్షగట్టి మరింత ఇబ్బందులకు గురి చేయడం తగదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి శ్రమకు తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. ఎస్ఓ లను ప్రిన్సిపల్స్ గా, పిజిసిఆర్టి లను జే ఎల్ గా, సిఆర్టి/పి ఈ టి/సీఆర్పీలను ఎస్ఏలుగా పరిగణించి కనీస మూల వేతనాన్ని చెల్లించాలని మరియు ఆరోగ్య భద్రత కల్పించడం కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని, కేర్ టేకర్లను నియమించి రాత్రి కాపలా డ్యూటీల నుండి విముక్తి చేయాలనీ డిమాండ్ చేస్తున్నాము. ఈ తదితర సమస్యల పరిష్కారానికి మూడు దశల పోరాటంలో భాగంగా మార్చి 9న సోమవారం రోజున పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు, మార్చి 16వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు అప్పటికి ప్రభుత్వ స్పందించకపోతే మార్చి 20 శుక్రవారం రోజున అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభమవుతున్న సందర్భంగా చలో అసెంబ్లీ నిర్వహిస్తామని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జాదవ్ సుభాష్, మండల అధ్యక్షులు హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ బడ్జెట్ సమావేశాల్లోపే సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డ్ లో కనీస వేతనాలకు సరిపడా నిధులకు ప్రతిపాదనలు పంపించాలని కోరుతున్నాం. లేనిచో సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీఆర్‌పిల సంఘం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు దహగం పవన్ కుమార్, ఎంఐఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, సీసీఓ ప్రకాష్ కెజిబీవీ సీఆర్‌టిలు జ్యోతి, శ్రీవని శకుంతల అరుణ మంగ మండల వనరుల కేంద్రం సిబ్బంది కేజీబీవీ టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీపీఓ శ్రీనివాస్, అధికారులు

## ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి: డీపీఓ శ్రీనివాస్

**సారంగాపూర్, మార్చి 09, ప్రభాతవార్త:**

మండలంలోని అడెల్లి పోచమ్మ ఆలయ పరిసరాల్లో సోమవారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎంపీడీవో ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని తొలగించి, ప్లాస్టిక్ నిషేధంపై భక్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పది రోజుల పాటు అన్ని గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎక్కడా పిచ్చి మొక్కలు లేకుండా తొలగించాలని, ప్రజాప్రతినిధుల సహకారంతో ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ మకాంత్, ఏపీవో అజీజ్ ఖాన్, ఆలయ చైర్మన్ భోజగౌడ్, స్థానిక సర్పంచ్ సాయన్న, సారంగాపూర్ సర్పంచ్ కోనేరు భూమన్న, జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, మల్టీపర్పస్ వర్కర్స్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు వాలీబాల్ కిట్ అందజేత

**పెంచికల్‌పేట్, మార్చి 9, ప్రభాతవార్త :**



మండలంలోని గుండే పల్లి గ్రామంలో యువతను క్రీడల వైపు ప్రోత్సహించే ఉద్యేశంతో ఉప సర్పంచ్ కుడిమేత తిరుపతి ఆదివారం వాలీబాల్ కిట్, నెట్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువకులు క్రీడలలో పాల్గొనడం ద్వారా శారీరకంగా దృఢంగా మారడంతో పాటు మంచి భవిష్యత్తు సాధించవచ్చన్నారు. గ్రామంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాను ఎప్పుడు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండేపల్లి యువకులు పాల్గొన్నారు.

## కొత్తగా ఏర్పడిన నగర పాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలి: మేయర్ ధర్ని మధుకర్

### - సింగరేణి జీఎం ఎం.శ్రీనివాస్‌తో మున్సిపల్ బృందం భేటీ

**నస్పూర్, మార్చి 9, ప్రభాతవార్త**



కొత్తగా ఏర్పడిన మంచిర్యాల నగర పాలక సంస్థ అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం పూర్తిస్థాయిలో సహకరించాలని మేయర్ ధర్ని మధుకర్ కోరారు. సోమవారం శ్రీరాంపూర్ సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం ఎం.శ్రీనివాస్‌ను మేయర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎంను శాలువాతో సన్మానించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సింగరేణి విస్తరించి ఉన్న డివిజన్లలోని పలు ప్రజా సమస్యలపై ఈ భేటీలో చర్చించారు. పారిశుధ్యం, నీటి సరఫరా మెరుగుపరచాలని, విద్యుత్ దీపాలు, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా రెండో డివిజన్ ప్రాంతంలో నెలకొన్న డంప్ యార్డ్ సమస్యను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. నగర అభివృద్ధిలో సింగరేణి భాగస్వామ్యం కీలకమని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, కార్పొరేటర్లు బండారి సుధాకర్, వేల్పుల రవీందర్, అగ్గు సాగర్, పత్తి పకృతి, బొడ్డు స్వప్న, నాయకులు తోట శ్రీనివాస్, మర్రి రాజమొగిలి, పత్తి వెంకటేష్, బొడ్డు తిరుపతి, మున్సిపల్ సిబ్బంది, జీఎం కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**నిర్మల్, మార్చి 09, ప్రభాతవార్త:**

ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు సమర్పించారు. ప్రజావాణి అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని పేర్కొన్నారు. త్వరలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు తగిన సూచనలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల సాధికారతతోనే సమాజ పురోగతి

**పెంచికల్‌పేట్, మార్చి 9, ప్రభాతవార్త :**

సమాజ అభివృద్ధికి మహిళల సాధికారత ఎంతో అవసరమని టీఎస్ యూటీఎఫ్ మండల కార్యదర్శి సమతకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కేజీబీవీ ప్రత్యేక అధికారి కవిత, సీనియర్ అసిస్టెంట్ లలితలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబం నుంచి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి భాధ్యత అని, విద్య, ఉపాధి, నాయకత్వ రంగాల్లో మహిళలకు ప్రోత్సాహం అందించినప్పుడే సమాజం సమతుల అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజ్ కమలాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనిల్, సీఆర్పీలు శ్రీనివాస్, శ్యామ్, కేజీబీవి ఉపాధ్యాయ సిబ్బంది, భోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించిన టీఎస్ యూటీఎఫ్ బృందం

## నీతి అయోగ్ సెమినార్‌లో పెంబి ప్రగతిని వివరించిన కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 09, ప్రభాతవార్త:**




ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా సోమవారం నిర్వహించిన నీతి అయోగ్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. నీతి అయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా పెంబి మండలంలో సాధించిన అభివృద్ధిని ఈ సందర్భంగా ఆమె వివరించారు. పెంబి మండలంలో విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలపై కలెక్టర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా గర్భిణులు, మహిళల్లో రక్తహీనత నివారణ, పోషకాహార లోపాల సవరణ, భూసార పరీక్షలు, విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు వంటి అంశాల్లో సాధించిన అద్భుత ప్రగతిని వెల్లడించారు. ప్రజల భాగస్వామ్యం, అధికారుల సమిష్టి కృషితో పెంబి బ్లాక్ ఆస్పిరేషన్ నుండి ఇన్‌స్పిరేషన్ స్థాయికి చేరుకుందని సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ నుండి కేవలం రెండు జిల్లాలు మాత్రమే ఈ సెమినార్‌కు ఎంపికవ్వగా, అందులో నిర్మల్ జిల్లా ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. పెంబి అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం అయినప్పుడే ప్రగతి ప్రణాళిక లక్ష్యాలు నెరవేరుతాయి

★ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ★ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా కాగజ్‌నగర్‌లో 2కే రన్



2కె రన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్



2కె రన్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, ప్రజలు

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 9, ప్రభాతవార్త

పట్టణ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అయినప్పుడే ప్రగతి ప్రణాళిక లక్ష్యాలు నెరవేరుతాయని కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, వైస్ చైర్మన్ డా.కొత్తపల్లి అనిత అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా 2కె రన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి జెండా ఊపి ప్రారంభించారు. 2కె రన్ ఉదయం తెలంగాణ చౌరస్తా నుండి ప్రారంభమై రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణ ప్రజల్లో ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా 2కె రన్ నిర్వహించామని, పట్టణంలో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించడం పరిశుభ్రతను ఒక సామాజిక బాధ్యతగా మార్చడమే ఈ 99 రోజుల ప్రగతి ప్రణాళిక ముఖ్య దేశమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు . ఈ సందర్భంగా గాంధీ పార్కులో పేరుకుపోయిన చెత్తను శాస్త్రీయ పద్ధతిలో రీసైకిల్ చేస్తూ, కంపోస్ట్ తయారీ విధానాన్ని అధికారులు ప్రారంభించారు. చెత్త నిర్వహణ (వాటర్ మేనేజ్‌మెంట్) ద్వారా పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎమ్మాజీ శారద, కచ్చకాయల జ్యోతి, కావేటి విజయ్ కుమార్, వాసిమున్నిస, పెండోర్ మాణిక్యారావులతో పాటు ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ మహిళలు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏకలవ్య ఆశ్రమంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

మంచిర్యాల, మార్చి 9, ప్రభాతవార్త



యోగ టీచర్‌ని సన్మానిస్తున్న దృశ్యం

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్డులో గల ఏకలవ్య ఆశ్రమంలో సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో సోమవారం రోజు మహిళా దినోత్సవ వేడుకలకు మైత్రీ యోగ ప్రకృతి చికిత్సా కేంద్రం స్థాపకులు, ప్రముఖ ప్రకృతి చికిత్సా వైద్యులు డా సమీరా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమీరా రెడ్డి మాట్లాడుతూ చిన్న వయసు నుంచి వృద్ధుల వరకు మహిళలలో ఆరోగ్య సమస్యలు వాటిని ఏ విధంగా ఎదుర్కోవచ్చు, ఎప్పుడు వైద్య చికిత్సలు తీసుకోవాలి, ఏ విధంగా శారీరక ఆరోగ్యం మానసిక ప్రశాంతత రెండింటిని పెంపొందించుకోవాలి వివరంగా తెలిపారు. దీనితోపాటు సమాజంలో తనకు తాను ఎదుగుతూ ప్రతి మహిళ ఇతర మహిళల అభివృద్ధిలో చేయూతనందించాలి, అప్పుడే సమాజమంతా కూడా అభివృద్ధి దిశకు వెళ్తుంది అని చెప్తూ, మన ఎదుగుదలలో కుటుంబ వ్యవస్థ పాత్ర గురించి, గతంలో వీరవనితల స్ఫూర్తి తో ఎలా ముందుకు వెళ్ళాలన్న విషయాలు తెలిపారు. ఇంత అద్భుతమైన శిక్షణను మహిళలకు కంప్యూటర్, కుట్టుమిషన్, బ్యూటీ కోర్స్ రంగాలలో అందిస్తున్నందుకు సేవా భారతి, ఏకలవ్య ఆశ్రమం నిర్వాహకులు, సూపర్వైజర్‌లను, శిక్షకులను అభినందించారు. అనంతరం శిక్షకులు నిర్వాహకులు అందరూ డాక్టర్ సమీరాని సత్కరించారు. కార్యక్రమంలో సేవా భారతి శిక్షకులు నిర్వాహకులు స్కిల్ డెవలప్మెంట్ స్టూడెంట్స్ అందరూ పాల్గొన్నారు.

## ఐటిఐలో షార్ట్ టర్మ్ కోర్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల, మార్చి 9, ప్రభాతవార్త



మంచిర్యాల ఐటిఐలో షార్ట్ టర్మ్ కోర్సుల తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

మంచిర్యాల ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన పలు స్వల్పకాలిక కోర్సులను జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్, శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రసంగిస్తూ.. యువత సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన వృద్ధికి, ఇతర సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ధైర్యంగా తన దృష్టికి తీసుకురావచ్చని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య–మహేష్, 51వ డివిజన్ కార్పొరేటర్ నీలి స్వప్న–శ్రీనివాస్, ఇతర కార్పొరేటర్లు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతూన్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

## ప్రకృతి వైపరీత్యాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి: అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

నిర్మల్, మార్చి 09, ప్రభాతవార్త:

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం, వరదల సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు జిల్లాలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాలపై సోమవారం కలెక్టరేట్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ పట్టణంతో పాటు వరద ప్రభావిత మండలాల్లో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల ద్వారా సామాజిక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ముందస్తు అవగాహన ఉంటే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, ఎన్డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్, లైజనింగ్ ఆఫీసర్ జగదీష్, జిల్లా అగ్నిమాపక అధికారి ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

సారంగాపూర్, మార్చి 09, ప్రభాతవార్త:

మండలంలోని బీరవెల్లి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంచార వాహనం ద్వారా గ్రామస్తులకు నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాలు, అప్రమత్తత, బ్యాంకింగ్ వ్యవస్థతో ముడిపడి ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంక్ వివరాలు తెలపకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ ఓబమ్మ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మందమర్రి, మార్చి 9, ప్రభాతవార్త:



మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మంచిర్యాలకు చెందిన బర్ల శంకర్ (64) తన భార్య రాజేశ్వరితో కలిసి ద్విచక్ర వాహనం పై మంచిర్యాల నుంచి నెన్నెల వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సమయం మందమర్రి సమీపంలోని హైవేపై వారి ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్ రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బర్ల శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య రాజేశ్వరికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు బర్ల కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మందమర్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారు

**✪ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**✪ నస్పూర్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**

**నస్పూర్, మార్చి 9, ప్రభాతవార్త**

దేశంలోని అత్యున్నత పదవుల నుంచి అన్ని రంగాల వరకు మహిళలు తమ సత్తా చాటుతున్నారని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. నస్పూర్‌లోని గోదావరి ఫంక్షన్ హాల్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు మునిగంటి ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమెరికాలో మహిళా దినోత్సవంగా ప్రారంభమై నేడు ప్రపంచవ్యాప్తంగా వేడుకలు జరుపుకుంటున్నామని జీఎం శ్రీనివాస్ తెలిపారు. సింగరేణిలోనూ మహిళలు అన్ని విభాగాల్లో అండర్ గ్రౌండ్ విధుల్లో రాణిస్తున్నారని చెప్పారు. పని ప్రదేశాల్లో వారికి రక్షణ కల్పించడంతో పాటు కనీస వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మహిళలకు సరైన అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా రాణిస్తారని ఉమారాణి పేర్కొన్నారు. నేడు మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తూ కొన్ని విభాగాలను శాసిస్తున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. వారిని నిరంతరం ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. పాకిస్తాన్ పై జరిపిన ఆపరేషన్ సింధూర్ కు మహిళలు నాయకత్వం వహించడం భారతీయులందరికీ గర్వకారణమని ఉమారాణి గుర్తు చేశారు. అంతకుముందు అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళా ఉద్యోగులుగా ఎంపికైన ఏజీఎం ఫైనాన్స్ సుమలత, వర్క్ షాప్ జనరల్ అసిస్టెంట్ పద్మను ఘనంగా సత్కరించారు. వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి శిక్షణా కోర్సులు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. చిన్నారులు, సేవా సభ్యులు, సింగరేణి కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం అనిల్ కుమార్, సీనియర్ పీఓ సురేందర్, సేవా సెక్రటరీ కొట్టె జ్యోతి, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

**● వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజా నరేందర్**

**తాండూర్, మార్చి 9, ప్రభాతవార్త :**

రైతులు అధిక పంట దిగుబడి కోసం ఆధునిక వేసే పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ బెల్లంపల్లి సహాయ సంచాలకులు రాజా నరేందర్ అన్నారు. కిష్టంపేట రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో సోమవారం రైతులకు వ్యవసాయ అంశాలపై కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల దిగుబడి పెంచే మార్గాలు, భూమి సారాన్ని కాపాడుకునే విధానాలు పాటించాలని సూచించారు. అనుమతి లేని హెచ్టి కాటన్ పత్తి విత్తనాల సాగు రైతులకు నష్టాలను కలిగించే ప్రమాదం ఉందని సూచించారు. కలుపు మందుల అధిక వినియోగం వల్ల భూమి యొక్క సారం, పంట దిగుబడి తగ్గుతుందన్నారు. రైతుల ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. రైతులు యూరియా బుకింగ్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి వినియోగం వలన రసాయనికి ఎరువుల వినియోగం కూడా తగ్గుతుందన్నారు. అందువల్ల రైతులు రసాయనక ఎరువుల వాడకం తగ్గించి వాటికి బదులుగా జీవామృతం, వర్మి కంపోస్ట్ ఎరువులు ఉపయోగించి ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, కిష్టంపేట సర్పంచ్, సార్ల తిరుపతి మండల వ్యవసాయ అధికారులు సుష్మ, ప్రభాకర్, ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకెళ్లాలి

**- బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్**



సబ్ కలెక్టర్ మనోజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**తాండూర్, మార్చి 9, ప్రభాతవార్త :**

విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకెళ్లితే సాధించలేనిది ఏది ఉండదని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్ అన్నారు. స్థానిక విద్యా భారతి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఆదివారం రాత్రి నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఏకగ్రత, క్రమశిక్షణ, మంచి మార్కులు సాధించాన్న లక్ష్యంతో ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగడం ఖాయమన్నారు. త్వరలో జరగనున్న పదోతరగతి వార్షిక పరీక్షలలో మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. తన తండ్రి తాండూర్ సిఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో 2006-2008 వరకు రెండు సంవత్సరాలు విద్యా భారతి పాఠశాలలో తాను చదువుకున్నానని అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నతనం నుంచే తాను ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో విద్యనభ్యసించానన్నారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించి తాను చదువుకున్న పాఠశాలకే ముఖ్య అతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, నాటికలు అందరిని అలరించాయి. పాఠశాల పూర్వ విద్యార్థి అయిన సబ్ కలెక్టర్ మనోజ్ ను విద్యా భారతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు సురభి ఆగమ రావు, పాఠశాల డైరెక్టర్ శరత్ కుమార్ శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సరోజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలెక్టర్ మనోజ్

# కేపీఎల్ క్రికెట్ టోర్నీ నిర్వహణ



**చింతలమానేపల్లి, మార్చి 9, ప్రభాతవార్త:**

మండలంలోని కర్జెల్లి గ్రామంలో నిర్వహించిన కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. మొత్తం 7 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో ఏవీఎస్ జట్టు అద్భుత ఆటతీరు ప్రదర్శించి విజేతగా నిలిచి రూ.18,000 నగదు బహుమతి కైవసం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన ఎస్ ఆర్ ఎస్ జట్టుకు రూ.9,000 నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు చౌదరి హరి, సర్పంచ్ చౌదరి నారాయణ విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు. టోర్నమెంట్‌లో డోకే సాయికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, డోకే ఓంకార్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు లభించాయి. కార్యక్రమంలో గ్రామ యువకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.